క్లుప్తంగా

శివాలయంలో ఘనంగా పూజలు



రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని శ్రీ భుజంగేశ్వర ఆలయంలో సోమవారం ఆలయ చైర్మన్ పోకల సుబ్బరాయుడు ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం జరిగిన రుద్రాభిషేకంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా నాగారపమ్మ జాతర



సంబేపల్లె : దండువాండ్లపల్లె సమీపంలో కొలువైన నాగారపమ్మ జాతర సోమవారం ఘనంగా ప్రాంభమైంది. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. వివిధ రకాల పుష్పాలతో అమ్మవారి గర్భగుడిని అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు చాందీబండ్లు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సెల్యూట్.. సీఐ



మెట్లపై కూర్చొని బాధితుడి నుంచి సమస్యను తెలుసుకొంటున్న సీఐ లింగప్ప

సంబేపల్లె : సాధారణంగా పోలీసులంటే కఠినంగా వ్యవహరిస్తారనే అభిప్రాయం చాల మందిలో ఉంటుంది. కాని ఖాకీ దుస్తుల వెనుక కరుణ హృదయం ఉంటుందని రాయచోటి రూరల్ సీఐ లింగప్ప నిరూపించాడు. మండలంలోని మోటకట్ల పంచాయతీ పాత్రెడ్డిగారిపల్లెకు చెందిన షేక్ సాబ్‌జాన్ అనే వ్యక్తి నడవడానికి కాళ్లు సహకరించకపోవడంతో నేలపై దోకుతూ సోమవారం సంబేపల్లె పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. పోలీస్‌స్టేషన్ ముందు భాగంలో మెట్లు ఎక్కలేక అక్కడే ఉండిపోయాడు. ఇది గమనించిన సీఐ బాధితుడి వద్దకు వచ్చి కింద కూర్చుని సమస్యను అడిగి తెలుసుకున్నాడు. సమస్యను వెంటనే పరిష్కారిస్తామని సీఐ హామీ ఇచ్చారు. దీంతో సీఐ తీరుపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

స్పందనకు వినతుల వెల్లువ



సమస్యలు వింటున్న తహసీల్దారు రామ్మోహన్

రైల్వేకోడూరు : స్పందన కార్యక్రమానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు రామ్మోహన్ ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వారి సమస్యలను విన్నారు. అనంతరం స్పందనలో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. నిర్దేశిత సమయంలోగా పెండింగ్‌లో సమస్యలు లేకుండా పరిష్కరించాలన్నారు. సమస్యలపై తక్షణమే స్పందించి వినతులను రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు.

పల్లకీలో ఊరేగిన వీరభద్రుడు



ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : భద్రకాళి సమేత వీరభద్రుడు పల్లకీలో ఊరేగారు. సోమవారం స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పూలు, ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి భక్తుల దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో ఊరేగించారు.

గాలివాన బీభత్సం.. పండ్లతోటలు ధ్వంసం



దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలిస్తున్న నేతలు, అధికారులు



దెబ్బతిన్న మామిడి తోటను పరిశీలిస్తున్న దృశ్యం

చిట్వేలి : ఆదివారం సాయంత్రం మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఒకసారి కురిసిన వానకు గాలి తోడవడంతో మండలంలో 173 ఎకరాల్లో పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. సమాచారం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, ఉద్యాన అధికారి ఆసియాతో కలిసి సోమవారం దెబ్బతిన్న పండ్లతోటలను పరిశీలించారు. రూ. 2 కోట్లు పంటనష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఆరుగాలం కష్టపడి సాగుచేసుకున్న పంటలు చేతికివచ్చే సమయంలో దెబ్బతినడంతో తమ పరిస్థితి ప్రశ్నార్థకరమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నగిరిపాడు, నేతివారిపల్లి, చెర్లోపల్లి, మార్గోపల్లి రైతు భరోసా కేంద్రాల పరిధిలో 143 ఎకరాల అరటి, 25 ఎకరాలు బొప్పాయి, 5 ఎకరాల మునగ పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు ఉద్యాన అధికారిణి ఆసియా, సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరగడం బాధాకరమన్నారు. త్వరగా పంటనష్టం అంచనా వేసి కమిషనర్ కార్యాలయానికి పంపాలని అధికారులకు సూచించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి రైతులను ఆదుకుంటామని పంజం పేర్కొన్నారు. మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ ప్రతాప్ రెడ్డి, లింగం లక్ష్మికర్, తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం మెరుగు



సిద్దవటం: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

సిద్దవటం : విద్యార్థులు పుస్తక పఠనం చేయడం ద్వారా విజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవచ్చునని సిద్దవటం గ్రంథాలయాధికారిణి లక్ష్మినారాయణమ్మ తెలిపారు. సిద్దవటం గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపునకు సోమవారం 28 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిని మాట్లాడుతూ విద్యార్థులతో పుస్తక పఠనంతో పాటు పాటలు పాడించడం, పద్యాలు, నీతి కథలు చెప్పించామన్నారు. తరువాత చెస్, క్యారం బోర్డు ఆటలను ఆడించి బిస్కెట్‌లను అందజేశామన్నారు.

గ్రంథాయంలో వేసవి శిబిరం

రైల్వేకోడూరు అర్బన్ : గ్రంథాలయ వేసవి శిబిరాలలో భాగంగా స్థానిక గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ఆంగ్ల, హిందీ భాషలలో విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్రమణ్యంశర్మ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి శిబిరాల వల్ల రాబోయే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు.

చిన్నమండెం : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కథలు, పద్యాల చదివించి, ఆటలాడించారు. అనంతరం సోషల్ టీచర్ రఘునాథరెడ్డి హిస్టరీపై విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్, మజ్జిగ, చాకెట్లు పంపిణీ చేసినట్లు గ్రంథాలయ అధికారి ఆంజనేయులురెడ్డి తెలిపారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి

రామాపురం : రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి రెవెన్యూ అధికారులకు సూచించారు. సోమవారం మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ అరవింద్ కిషోర్‌తో మాట్లాడుతూ రైతులకు సంబంధించిన రీ సర్వే, 1బి, అడంగల్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆయనతోపాటు సర్పంచ్ నాగభూషన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, సుబ్బయ్య, రఘు, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, ఓబులేసు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి



సమీక్షిస్తున్న వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : గ్రామాలలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి సోమవారం వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్‌లో నవధాన్యాల సాగు నేలతల్లి బాగు కార్యక్రమంపై మండల అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించి రైతులకు సలహాలిచ్చి ప్రోత్సహించాలని తెలిపారు. నాణ్యమైన పంటలు పండించినప్పుడే ప్రజల ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రామకృష్ణ, సుబ్రమణ్యంరాజు, మల్లు కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చారు.. భూములేవీ!



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న దళితులు

రాజంపేట : 18 సంవత్సరాల క్రితం దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో 140 మంది పట్టాలిచ్చారని, ఆ భూములకు సంబంధించి హద్దులు నేటికి చూపించలేదంటూ ఓబులవారిపల్లె మండలంలోని దళితులు ఆర్డీఓ భాస్కర్‌కు మొర పెట్టుకున్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయానికి ఓబులవారిపల్లె మండలంలోని చిన్నఓరంపాడు కమ్మపల్లె, దళితవాడ, జ్ఞానంపల్లె అరుంధతి వాడ గ్రామాలకు చెందిన దళితులు ఆర్డీఓ కార్యాలయానికి మూకుమ్మడిగా చేరుకొని నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రస్తుతం ఆ భూముల పక్కనే కడప – రేణిగుంట జాతీయరహదారి వెళుతుండటంతో ఆ భూములపై భూ కబ్జాదారుల కన్ను పడిందన్నారు. నిజమైన లబ్ధిదారులను ఆ భూముల్లోకి రాకుండా అడ్డుకుంటున్నారని ఆర్డీఓకు విన్నవించారు. 2005లో 17.08.2005న దళితులకు అసైన్‌మెంట్ కమిటీలో అప్పటి ఆర్డీఓ చేతుల మీదుగా ఇచ్చిన భూముల రికార్డులను పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత మహిళలు, దళిత ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ముద్దా

పుల్లంపేట : గ్రామాల అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పుల్లంపేట మండలంలో పెద్దూరు ఎస్టీ కాలనీ, పాపక్కగారిపల్లె, దళితవాడ, పెద్దూరు ఎస్టీ కాలనీ గ్రామాలను కలుపుకుంటూ రూ.3 కోట్లతో 4.5 కిలోమీటర్ల తారురోడ్డు పనులను సోమవారం ఎంపీపీ ప్రారంభించారు. గ్రామాల్లో రోడ్లు వేయడంతో రైతులు పండించిన పంటలను సకాలంలో మార్కెట్‌కు తరలించుకోవచ్చని దీంతో రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు.

జాతర నిర్వహించాలని భక్తుల నిరసన



మదనపల్లె : కోర్టులో గంగమ్మ దేవస్థానం జాతర ఉత్సవాన్ని నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా మహిళా భక్తులు ఆలయం వద్ద నిరసన తెలిపారు. సోమవారం మదనపల్లె–బెంగళూరు రోడ్డులోని కోర్టులో గంగమ్మ దేవస్థానం వద్దకు చేరుకున్న మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర నిర్వహణపై కమిటీ సభ్యులు మార్పూరి శశిధరరావు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ భవానీప్రసాద్‌తో చర్చించారు. జాతర నిర్వహణపై ఇప్పటివరకు ఆలయ కమిటీ సభ్యులు ప్రకటన చేయకపోవడంపై నిరసన తెలిపారు. ప్రతి ఏడాది మేనెలలో నిర్వహిస్తున్న జాతరను నిర్వహించకపోతే పట్టణానికి అరిష్టం కలుగుతుందన్న భావన ప్రజలందరికీ కలుగుతోందన్నారు. అమ్మవారి జాతర జరిపేందుకు ఆలయ కమిటీ సభ్యులకు ఏవేని ఇబ్బందులు ఉంటే, తమకు అనుమతిస్తే తామే సొంతంగా జాతర జరుపుకుంటామన్నారు.

రేపు మండల సమావేశం

రాజంపేట టౌన్ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సాధారణ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాలమునుస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ మెంబర్లు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

అన్నదాతలకు సన్మానం

రాయచోటి టౌన్ : భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి సోమవారం సహకరించిన దాతలను ఆలయ పాలకమండలి చైర్మన్ పాలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో సన్మానించారు. బీజాపూర్‌కు చెందిన శరణప్ప బండెప్ప, సి.చంద్రావతి, సి.బసవరాజు, రమేష్ బాబు, విజయకుమార్ వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. వీరిని ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

రాయచోటి అర్బన్ : పెట్రోల్‌ట్యాంక్‌ను శుభ్రం చేయడానికి దిగి ప్రాణం కోల్పోయిన మృతుల కుటుంబీకులకు ప్రభుత్వం కోటి రూపాయలను ఎక్స్‌గ్రేషియాగా చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ మృతుల కుటుంబీకులతో చర్చించామన్నారు. ట్యాంకును శుభ్రం చేయడానికి తీసుకోవాలసిన జాగ్రత్తలు, సేఫ్టీ కిట్లను కార్మికులకు సదరు సంస్థ కాంట్రాక్టరు ఇవ్వకపోవడంతోనే సంఘటన చోటుచేసుకుని ముగ్గురు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సంఘటనపై విచారణ జరిపించి సంఘటనకు బాధ్యుడైన కడపకు చెందిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

రాజంపేట స్కిల్ హబ్‌లో శిక్షణ

రాయచోటి టౌన్ : స్కిల్ హబ్ ద్వారా నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగుల ఉద్యోగ కల్పన కోసం అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అందులో భాగంగానే రాజంపేటలోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసి మూడు నెలలపాటు ఉచితంగా జూనియర్ సాఫ్ట్‌వేర్ కోర్సుతో పాటు టైలరింగ్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. దీని కోసం 10తరగతి, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారు అందరూ అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 9603770097లో సంప్రదించాలన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామం బాపూజీనగర్‌కు చెందిన తలారి అరుణమ్మ, రామ్మోహన్‌ల పెద్ద కుమార్తె లావణ్య(19) కనబడటం లేదంటూ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ నెల 25వ తేదీన బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన లావణ్య ఇప్పటి వరకు ఇంటికి రాలేదన్నారు. సుండుపల్లె మండలానికి చెందిన సలవ వెంకటయ్యతో తరుచూ ఫోన్‌లో లావణ్య మాట్లాడుతుండేదని, పోలీసులకు అతనిపై అనుమానం వ్యక్తం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అన్నదానం

రామాపురం : ప్రేమాలయంలో వృద్ధులకు దాతల సహకారంతో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. నేషనల్ హైస్కూల్ అధినేత మహదేవపల్లి నరసింహారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా కుమారుడు అశోక్‌రెడ్డి, లావణ్య రెడ్డిల ఆర్థిక సహాయంతో అన్నదాన్నం చేపట్టినట్లు లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ అధ్యక్షుడు మహమ్మద్ తెలిపారు. దాత కుటుంబ సభ్యులు పార్వతమ్మ, తనిష్క, నరసింహ, తనీష్‌రెడ్డి, వినోద్‌కుమార్ నాయక్, ప్రేమాలయం మేనేజర్ సుబ్బయ్య పాల్గొన్నారు.

చిట్వేలి : ప్రతి సోమవారం క్రమం తప్పకుండా అన్నదానం చేస్తూ గణేష్ హోటల్ యాజమాన్యం అందరికీ ఆదర్శంగా నిలిచింది. మానవత చిట్వేలి మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారంతో కలిపి మొత్తం 36 సోమవారాలు అన్నదానం చేయడం గమనార్హం.

అర్జీదారులకు అన్నదానం..

రాయచోటి అర్బన్ : గ్రీవెన్స్‌సెల్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమం 21వ వారానికి చేరుకుంది. సోమవారం వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ ఆర్థిక సౌజన్యంతో అన్నదానం నిర్వహించారు. అర్జీదారులకు రుచికరమైన భోజనంతో పాటు అరటి పండును అందజేశారు. అర్జీదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు దర్బారు సాయినాథుని వార్షికోత్సవం



ఆలయంలోని సాయినాథుని విగ్రహం

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామంలో దర్బారు సాయి నగరంలో వెలిసిన సాయినాథుని 25వ వార్షిక బ్రహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. 24 సంవత్సరాల క్రితం సద్గురు హజరత్ దర్బారు కోరికపై దర్బారు నగరంలో భక్తులచేత సాయినాథుని మందిరం నిర్మించారన్నారు. 30న మంగళవారం ఉదయం 8గంటల నుంచి షోడశ పూజలు, పంచామృత అభిషేకం, 10:15 గంటలకు హోమాలు బెంగళూరు వేదపండితులచే కార్యక్రమాలు చేయనున్నట్లు చెప్పారు. సాయంత్రం 7 గంటల నుంచి 8గంటల వరకు పల్లకీ ఉత్సవం ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక ఆకర్షణగా వేణుగోపాలస్వామి ప్రతిమ

పెనగలూరు : వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటగా అంకురార్పణ చేసి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు వేణుగోపాలస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే పెనగలూరు – కొత్తపల్లి వరకు వివిధ రకాల దేవుళ్ల చిత్రాలను విద్యుత్ దీపాలతో రోడ్డుపై ఏర్పాటు చేశారు. సోమవారం వర్తక సంఘం ఆధ్వర్యంలో మొదటిరోజు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ సుబ్బనరసయ్యలు తెలిపారు.

భూ కజ్జాదారులపై చర్యలు తీసుకోండి

రాయచోటి అర్బన్ : భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లానేత విశ్వనాథ డిమాండ్ చేశారు. సోమవారం ఈ విషయమై కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో అర్జీని సమర్పించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ పెద్దమండ్యం మండలం దిగువపల్లె గ్రామం సర్వేనంబరు 288/2లో చిన్నప్పకు 5.21 ఎకరాల భూమి ఉందన్నారు. సదరు భూమిని గాలివీడు మండలానికి చెందిన పెనుగొండ జయరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డిలు తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించి చిన్నప్పపై బెదిరింపులకు దిగుతున్నారంటూ ఆరోపించారు. కాగా సదరు భూమికి సంబంధించిన 1బి అడంగల్‌లో పెనుగొండ సోదరులు పేర్లు ఎక్కపోవడంతో సంతకాలు చేయాలంటూ చిన్నప్పను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై పెద్దమండెం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తమరైనా జోక్యం చేసుకుని చిన్నప్ప భూమిని అక్రమంగా కాజేసేందుకు కుట్రలు పన్నుతున్న వారిపై విచారణ జరిపించి న్యాయం చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో పెద్దన్న, రఘునాథ్, మదన్‌మోహన్, పెద్దప్ప, యండపల్లె వెంకటరమణ, రామప్పతో పాటు బాధిత కుటుంబీకులు పాల్గొన్నారు.

‘ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి’



కలెక్టరేట్ ఎదుట మోకాళ్ళపై నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : పార్లమెంట్ నూతన భవన ప్రారభోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పిలవకుండా అవమానించిన ప్రధాని నరేంద్రమోడీ వెంటనే దేశప్రజలకు క్షమాపణ చెప్పాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఏపీ గిరిజన సమాఖ్య, ప్రజాసంఘాల నేతలు సోమవారం కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. గిరిజన నేత విశ్వనాథనాయక్, ఎమ్మార్పీఎస్ నేత రామాంజులు, పౌర హక్కుల సంఘం నేతలు రవి శంకర్, రెడ్డెయ్యలు మాట్లాడుతూ రాష్ట్రపతి అయిన ద్రౌపది ముర్ముకు పార్లమెంటు భవనం ప్రారంభోత్సవానికి కనీస ఆహ్వానం లేదంటే నరేంద్రమోడీ ప్రభుత్వంలో కులవివక్ష ఏ విధంగా ఉందో అర్థమవుతోందన్నారు. దేశంలో జాతీయ త్రివర్ణ పతకం స్థానంలో కాషాయ జెండాను ఎగురవేయడానికి మోడీ కుట్రలు పన్నుతున్నాడంటూ మండిపడ్డారు. అనంతరం ఈమేరకు జిల్లా కలెక్టర్‌కు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో లంబాడ సంఘం జాతీయ నేత మూడే శంకర్‌నాయక్, ఆల్‌ఇండియా బంజారాసంఘం నేత నారాయణ నాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, గిరిజన నేతలు దేవరాజు నాయక్, రూపారాణి, విలోజి నాయక్, ఎల్లప్పనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చట్టం దృష్టిలో అందరూ సమానమే



ఎస్ఐ చంద్రమోహన్‌ను కలసిన సర్పంచ్ నాగార్జునాచారి

వీరబల్లె (రాయచోటి టౌన్) : చట్టం దృష్టిలో అందరూ సమానమేనని వీరబల్లె ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. ఆయన నూతనంగా వీరబల్లె మండల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఆయనను మట్లి సర్పంచ్ నాగార్జునాచారి కలసి అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ చట్టం దృష్టిలో ప్రజలు, నాయకులు అనే తేడాలు ఉండవని చట్ట దృష్టిలో అందరూ సమానమేనని చెప్పారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ముందుగా ఇరువురిని పిలిచి సామరస్యంగా పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు.

భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ సీఐ సుబ్బమ్మ

గాలివీడు : భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ సీఐ సుబ్బమ్మ తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. మాట్లాడుతూ వేసవి కాలంలో పలు రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాలను సందర్శించి దర్శించుకోవడం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ప్రభుత్వం తక్కువ ఖర్చుతో ఆర్టీసీ పుణ్యక్షేత్రాల దర్శనం కోసం టూరిజంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాయచోటి నుంచి శైవక్షేత్రం(తిరుణ్ణామలై), ఊటీ, షిర్డి సాయినాథుని దర్శనం, వేళాంగణి, నాగూరు, శ్రీహరికోటలకు స్పెషల్ బస్సులను నడుపుతోందని, ప్రతి ఆదివారం రాయచోటి నుంచి బోయకొండ గంగమ్మ, సోమవారం శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనం కోసం ప్రత్యేక బస్సు సరీస్సులను నడుతున్నామన్నారు. బుకింగ్‌ల కోసం డిపోలో సంప్రదించాలని కరపత్రాలను పంపిణీ చేశారు.

కరపత్రాలు వేయించిన వారిపై చర్యలు తీసుకోండి



డీఎస్పీ చైతన్యకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ వివిధ విభాగపు కన్వీనర్లు

రాజంపేట టౌన్ : ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ప్రతిష్టతకు భంగం కలిగించేలా ఇటీవల కరపత్రాలు వేయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు డిమాండ్ చేశారు. సోమవారం డీఎస్పీ వీఎన్ చైతన్యను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గత కొంతకాలం క్రితం నేరుగా ఎమ్మెల్యే పేరు పొందుపరిచి ఆయన ప్రతిష్టతను దెబ్బతీసేలా పోస్టర్లు ముద్రించారని, ఇదంతా చేస్తున్నది రాజంపేట పట్టణానికి చెందిన బిల్లా నరేష్, రేనాటి రాఘవేంద్రరాజు, ఉసిరికాయల సిద్దార్థ్ గౌడ్ మరి కొంత మంది వారి అనుచరులే అని తాము గట్టిగా నమ్ముతున్నట్లు వారు డీఎస్పీకి అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు కూడా విమర్శించలేని విధంగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి గత నాలుగు సంవత్సరాలుగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. ఇటీవల రాజంపేట, నందలూరులలో వెలువడిన కరపత్రాలు ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయన్నారు. ఈ కరపత్రాలు రెండు ప్రాంతాల ప్రజల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టించి ఇటు ఎమ్మెల్యేకి అటు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావడంలో భాగమే అన్నారు. ఎమ్మెల్యే ప్రతిష్టతకు భంగం కలిగేలా పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరినట్లు వారు తెలిపారు.

కఠిన చర్యలు తీసుకుంటాం : డీఎస్పీ చైతన్య

ఎమ్మెల్యే మేడాపై కరపత్రాలు వేయించిన వారితో పాటు ముద్రించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వీఎన్.చైతన్య తెలిపారు. వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు డీఎస్పీకి వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరపత్రాలు నందలూరు మండల కేంద్రంలో, రాజంపేటలోని ఎమ్మెల్యే కార్యాలయం సమీపంలోని మన్నూరులో వెలువడ్డాయన్నారు. తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు నందలూరు పోలీస్ స్టేషన్‌లో కేసును నమోదు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.